ప్రజాశక్తి

సోమవారం 2 జూన్ 2025

5

పార్వతీపురం మన్యం

కరాటే విజేత యాగ్నిక్

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పెద్దూరుకు చెందిన ఆరిక యాగ్నిక్‌కు సౌత్ ఇండియా కరాటే పోటీల్లో మొదటి బహుమతి లభించింది. ఆదివారం విశాఖపట్నంలోని ఎంవిపి కాలనీ ఎపి టూరిజం పాలమాంబ ఫంక్షన్ హాల్ ఈ పోటీలు నిర్వహించారు. కరాటే విభాగంలో ఫస్ట్ సౌత్ ఇండియా కరాటే పోటీల్లో మొదటి ప్రైజ్ దక్కించుకున్నందుకు కరాటే కోచ్ సింహాచలం, తల్లిదండ్రులు అభినందించారు.

ప్రథమస్థానంలో నిలిచిన యాగ్నిక్ (కుడివైపు)

23 ఏళ్లుగా వెట్టి చాకిరీ

కొన్ని ఉద్యోగాలు పేరుకే ప్రభుత్వ కొలువులు. నిత్యం వెట్టిచాకిరే. పనికి తగ్గ ఫలితం లేకపోవడంతో కనీసం కుటుంబాలను కూడా పోషించలేని పరిస్థితి. ప్రభుత్వాలు మారినా వారి జీవితాల్లో మార్పు మాత్రం రావడం లేదు. 23 ఏళ్లుగా పనిచేస్తున్నా ఇంకా రూ.5 వేలు వేతనానికే పరిమితమయ్యారు. వారే ఆదివాసీ మాతృ బహు భాషా విద్యా వాలంటీర్లు. గిరిజన విద్యాభివృద్ధికి అహర్నిశలు వీరు కృషి చేస్తున్నారు. అలాంటి వారిని పాలకులు నిర్లక్ష్యంగా వదిలేశారు. ఇప్పటికే పలు రూపాల్లో, ఆందోళనలు చేసినా, గల్లీ నుంచి ఢిల్లీ వరకు వినతులు అందజేసినా ప్రయోజనం కనిపించలేదు.

ఐటిడిఎ వద్ద ధర్నా చేస్తున్న సవర భాషా వాలంటీర్లు (ఫైల్)

- క్రమబద్ధీకరణకు నోచని ఆదివాసీ మాతృభాష వాలంటీర్లు
- కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా గుర్తించేదెప్పుడో?

ప్రజాశక్తి-సీతంపేట

ఆదివాసీ మాతృ భాష ఉపాధ్యాయులచే గత 23 ఏళ్లుగా ప్రభుత్వాలు వెట్టిచాకిరీ చేయిస్తుంది. ఇచ్చిన రూ.5వేలు గౌరవ వేతనం ఎందుకూ సరిపోవడంలేదు. ప్రస్తుతం ఒక కుటుంబం జీవనం సాగించాలంటే కనీసం రూ.20వేలు అవసరం ఉంటుంది. పని భారం ఎక్కువ ఫలితం తక్కువ ఇస్తున్న ఆదివాసీ మాతృ భాష ఉపాధ్యాయులు (సవర భాష విద్య వాలంటీర్లు) పరిస్థితి మరింత దారుణంగా ఉంది. చెప్పుకోవడానికి ప్రభుత్వ కొలువులు అయినా ఆశించిన ఫలితం ఉండదు. తల్లిదండ్రుల కమిటీ తీర్మానం చేసి ఇచ్చిన లేఖ ఐటిడిఎ పిఒ ద్వారా ఎస్ఎస్ఎకు సిఫారసు చేస్తే వారి నుంచి వచ్చిన బడ్జెట్ ఐటిడిఎకు పంపిస్తుంది. దీనితో గౌరవ వేతనం ఐటిడిఎ ఆదివాసీ మాతృ బహుభాష ఉపాధ్యాయులకు గౌరవ వేతనం ఇస్తుంది. 23 ఏళ్లుగా రెండుసార్లే చేరుకో వెయ్యేసి పెంచారు. ప్రస్తుతం రూ.5వేలు ఇస్తుంది. ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉత్తరాలు కూడా జారీ చేయకపోవడం గమనార్హం. మైదాన ప్రాంతం ఉపాధ్యాయులు తెలుగులో బోధించినవి అర్థం కాక గిరిజన శిఖరాల కొండల పైనున్న ఆదివాసీ గిరిజనులు పిల్లలు డ్రాప్ అవుట్ గా మారుతున్నారు. చిన్నారులు బడికి రాకపోవడాన్ని అప్పటి ఐటిడిఎ పిఒ గుర్తించి వారి మాతృభాషలోనే చదువు చెప్తే వస్తారని గుర్తించి సవర భాష విద్య వాలంటీర్లను నియమించారు. ఈ మేరకు ఆదివాసీ మాతృభాష ఉపాధ్యాయులు ఒకటి నుండి 5వ తరగతి వరకు మాతృభాషలో విద్యాబోధన చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల మాదిరిగానే ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వీరు రెగ్యులర్ ఉపాధ్యాయుడు మాదిరిగానే పని చేస్తున్నారు. అయినా వేతనం మాత్రం అప్పట్లో రూ.1000 ఇస్తే ప్రస్తుతం రూ.5000 ఇస్తున్నారు.

రాష్ట్రంలో పది జిల్లాల్లో 1300 పాఠశాలల్లో 1300 ఉపాధ్యాయులు విద్యను అందిస్తున్నారు. వీటిలో (పివి టీజీ) ఆదివాసీ గిరిజన భాషలైన సవర, కొండ, కూవి, ఆదివాసి ఒడియ, కోయ, సుగాలి తదితర ఆరు భాషల్లో మాతృబహు భాషా ఉపాధ్యాయులు విద్యను అందిస్తున్నారు. సీతంపేట ఐటిడిఎ పరిధిలో 155 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 155 ఆదివాసీ మాతృ బహుభాషా ఉపాధ్యాయులు సీతంపేట, భామిని, పాలకొండ, వీర గొట్టం మండలాల్లో విద్యను అందిస్తున్నారు..

ప్రభుత్వం ఇస్తున్న గౌరవ వేతనం చాలదని, క్రమబద్ధీకరణ చేయాలని రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీ మాతృభాష ఉపాధ్యాయులు నిరాహార దీక్షలు, ధర్నాలు సీతంపేట, విజయవాడలో చేపట్టారు. కనీసం పనికి తగ్గ వేతనం రూ.26వేలు ఇవ్వాలని గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఎంతో మందిని కలిసినా ప్రయోజనం కనిపించలేదు. 2023లో యువ గళం పాదయాత్రలో ప్రస్తుతం విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను పాయకరావుపేటలో ఆదివాసీ మాతృభాష ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సమస్యలను విన్నవించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీనిపై ఇంతవరకు నోరు మెదపడం లేదని వాలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కూడా విన్నవించారు. అయినా ఫలితం లేదు.

కొన్ని రాష్ట్రాల్లో రెగ్యులర్

2022లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు కేంద్రం రూ.5 వేలు అందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అక్కడున్న ఆర్థిక పరిస్థితులను బట్టి మీరు ఎంతో కొంత ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే దానికి అనుగుణంగా ఒడిశా రాష్ట్రం ఆదివాసీ మాతృ బహుభాషా విద్యా వాలంటీర్లను రెగ్యులర్ చేస్తూ, రూ.22 వేలు జీతం ప్రకటించింది. కేరళ, త్రిపుర, జార్ఖండ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో రెగ్యులర్ చేసినట్లు తెలిసింది.

ఎంపిక విధానం కష్టమే

సవరభాషా విద్యా వాలంటీర్‌గా పనిచేయాలంటే డిగ్రీతో పాటు బిఇడిని ప్రామాణికంగా తీసుకుంటారు ఖాళీగా ఉన్నచోట భర్తీ చేసినప్పుడు ఉన్నతాధికారుల విద్యాకమిటీ ఎంపిక చేస్తుంది. పిఒ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరుగుతుంది. ఎంపికైన వారి జాబితాను సమగ్రశిక్ష డైరెక్టర్‌కు పంపిస్తారు. అక్కడ నుండి వేతనం పడుతుంది.

ప్రభుత్వమే ఉత్తర్వులు ఇవ్వాలి

ఔట్సోర్సింగ్ లేదా కాంట్రాక్ట్ ఉపాధ్యాయులుగా ఆదివాసీ మాతృ భాష ఉపాధ్యాయులను గుర్తించాలి. తల్లిదండ్రులు కమిటీ తీర్మానం లేకుండా ప్రభుత్వమే నేరుగా ఒక ఆర్డర్ కాపీ ఇవ్వాలి.

- సవరణ డోంబు, ఆదివాసీ మాతృ బహుభాషా విద్యా వాలంటీర్ల సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి

రూ.26వేలు వేతనం ఇవ్వాలి

పనికి తగ్గ ఫలితం రావడం లేదు. రెగ్యులర్ ఉపాధ్యాయులు మాదిరిగానే ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యార్థులకు విద్యను బోధిస్తున్నాం. ప్రభుత్వం 23 ఏళ్లుగా రూ.5వేలు మాత్రమే ఇస్తుంది. ఈ డబ్బులు ఎందుకూ సరిపోవడంలేదు.

- సవరణ ఆనందరావు, ఆదివాసీ మాతృ బహుభాషా విద్యా వాలంటీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు.

ఒడిశా మాదిరిగా రెగ్యులర్ చేయాలి

ఒడిస్సా రాష్ట్రం మాదిరిగా సవర భాష వాలంటీర్లను ఆదివాసీ మాతృబహుభాష ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి. లేదా సిఆర్టిలుగా మాదిరిగా టైమ్ స్కేల్ ప్రకటించాలి. రాష్ట్ర విద్యా శాఖ విలీనం చేయాలి.

- సవర ఎల్లంగో, ఆదివాసీ మాతృ బహుభాషా విద్యా వాలంటీర్ల సంఘం జిల్లా కోశాధికారి

ప్రజల సౌకర్యం కోసమే పాత విధానం

రేషన్ పంపిణీని ప్రారంభించిన మంత్రి

లబ్ధిదారునికి రేషన్ అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరురూరల్

గత ప్రభుత్వ హయాంలో ఇంటికే రేషన్ సరుకులు పంపిణీకి ఎండియు వాహనాల పథకం తీసుకొవచ్చారని అన్నారని, కానీ ఇది సరైన రీతిలో పనిచేయలేదని కూటమి ప్రభుత్వం పరిశీలించి ప్రజల సౌకర్యం కోసం మళ్లీ పాత విధానాన్ని ప్రారంభించిందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రేషన్ పంపిణీ కార్యక్రమం చౌక ధరల దుకాణం నుంచి పంపిణీని సాలూరులో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి నెలా 1 నుంచి 15 వరకు, తమకు దగ్గరలో ఉన్న ఏ రేషన్ షాపు నుండైనా రేషన్ తీసుకోవచ్చున్నారు. 65 ఏళ్లకు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఇంట్లోనే రేషన్ సరుకులు పొందేలా ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేశామన్నారు. రాబోయే రోజుల్లో రేషన్ షాపుల్లో ఇతర నిత్యావసర వస్తువులు అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. ఎండియు వాహనాలపై ఉన్న లోన్లు ప్రభుత్వమే చెల్లించి, ఆ వాహనాలను లబ్దిదారులకు ఇస్తున్నారని చెప్పారు. వారు వాటిని తమ ఉపాధి కోసం ఉపయోగించుకో వచ్చుని మంత్రి తెలిపారు. ఈ మార్పులు ప్రజల కోసం, వారి సౌకర్యం కోసమేనని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎంవి రమణ, స్థానిక అధికారులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ఖాళీ బిందెలతో మహిళల నిరసన ర్యాలీ

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న శివరాంపురం, సుభద్ర గ్రామాల మహిళలు

ప్రజాశక్తి - బలిజిపేట

తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ మండలంలోని శివరాంపురం, సుభద్ర గ్రామస్తులు ఖాళీ బిందెలతో సిపిఎం ఆధ్వర్యాన ఆదివారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు యమ్మల మన్మథరావు, గంట్యాడ బలరామనాయుడు మాట్లాడుతూ తాగడానికి మంచినీళ్లు లేక శివరాంపురం, సుభద్ర గ్రామస్తులు అల్లాడిపోతున్నారని, ఎండాకాలం వచ్చిందంటే తాగడానికి నీళ్లు లేక చాలా ఇబ్బందులు పడుతూ కిలోమీటరు దూరం సుభద్ర బీటీ రోడ్ సెంటర్ నుంచి పొలాల్లో మోటర్ నుండి నీళ్లు తెచ్చుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటింటికీ కుళాయి వేస్తామని చెప్పి ఇప్పటికీ వేయలేదని, అడిగితే చూద్దాం చేద్దాం అంటున్నారు కాలం వెళ్లదీస్తున్నారు తప్ప తాగడానికి నీళ్లు ఇవ్వడం లేదని విమర్శించారు. తప్పని పరిస్థితుల్లో మంచినీళ్ల కోసం దాతలు సహకారం వ్యవసాయ పొలంలో మోటర్ దగ్గరకు వెళ్లాల్సి వస్తుందని, వెంటనే యుద్ధ ప్రాతిపదికన మోటర్లు బాగు చేసి మంచినీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని మహిళలు, సిపిఎం నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో చెల్లింపేట సిపిఎం నాయకులు సత్యం, జగన్నాథం, విశ్వేశ్వర, జ్యోతి అధిక సంఖ్యలో గ్రామ మహిళలు పాల్గొన్నారు.

పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

మలేరియాపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆదివారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. వైద్య సిబ్బందితో కలిసి మలేరియా నివారణకు సంబంధించిన నినాదాలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జగన్మోహన్ మాట్లాడుతూ దోమల నిర్మూలనతో మలేరియా నివారించ వచ్చని వీటిపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండి మన అందరిలో మార్పుతో అది సాధ్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైడే పాటించాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని అన్నారు. తద్వారా దోమలు వృద్ధి చెందకుండా ఉంటాయన్నారు. మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో ఎక్కువ దృష్టి సారించాలని, మారుమూల గిరిజన గ్రామీణ ప్రాంతాల్లో జ్వర లక్షణాలు సత్వరమే గుర్తించి వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించాలన్నారు. జూన్1నుంచి ఈ నెలాఖరు వరకు మలేరియా మాసోత్సవ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎఎంఒ సూర్యనారాయణ మాట్లాడుతూ ఈ ఏడాది జిలాల్లో 915 ప్రభావిత గ్రామాల్లో దోమల నివారణకు స్ప్రేయింగ్ (ఐఆర్ఎస్) చేపడుతున్నామని, ఇప్పటి వరకు 465 గ్రామాల్లో పూర్తయ్యాయన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ పుష్ప, వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

పండగకు సేవలందించిన అధికారులకు సత్కారం

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో ఇటీవల జరిగిన శ్యామలాంబ అమ్మవారి పండగను విజయవంతంగా నిర్వహించి అధికారులకు, సిబ్బందికి, కార్మికులను రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి సత్కరించారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి.ఏర్పాటు చేశారు. ఆదివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పండగ నిర్వహణలో ఎంతో కృషి చేసిన అధికారులకు ప్రతి ఒక్కరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. పండుగ సందర్భంగా శాంతి భద్రతలు, పట్టణ పరిశుభ్రత, వాహనాల రాకపోకల నిర్వహణ, భక్తులకు ఏర్పాటు చేసిన సదుపాయాలు అన్నింటిలోనూ అధికారులు, సిబ్బంది, కార్మికులు సమిష్టిగా పని చేసిన తీరు ప్రశంసనీయమని అన్నారు. ఈ మేరకు పట్టణ, రూరల్ సిఐలు బి.అప్పలనాయుడు, రామకృష్ణకు, తహశీల్దార్ ఎన్‌వి రమణ, మున్సిపల్ కమిషనర్ డిటివి కృష్ణారావు, శానిటరీ ఇన్స్పెక్టర్ బాలకష్ణ, ఎంపిడిఒ పార్వతి, పోలీస్, మున్సిపల్ సిబ్బందికి పూలబొకెలతో దుశ్శాలవాలతో మంత్రి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్, ఆలయ అనువంశికత ధర్మకర్త విక్రమ్ చంద్ర సన్యాసిరాజు, పట్టణ, మండల టిడిపి అధ్యక్షులు నాయకులు నిమ్మాది తిరుపతి రావు, ఆమదాల పరమేష్, అక్యాన అప్పారావు, గుల్ల వేణుగోపాలనాయుడు, ముఖీ సూర్య నారాయణ, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అధికారులను సన్మానిస్తున్న మంత్రి సంధ్యారాణి

ఏజెన్సీలో వంద శాతం రిజర్వేషన్ కల్పించాలి

- కూటమి ఇచ్చిన హామీని అమలు చేయాలి
- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

గిరిజన నిరుద్యోగులకు 100శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్న కూటమి హామీని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలో సురేంద్ర డిమాండ్ చేశారు. ఏజెన్సీ అభ్యర్థులకు స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలని, 100శాతం రిజర్వేషన్ సాధనకై చేపట్టిన రాష్ట్ర జీపు యాత్ర ఆదివారం మండలంలోని రావికోనకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక గిరిజన యువకులు, మహిళలు, వృద్ధులు యాత్రకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ గిరిజన నిరుద్యోగులకు స్పెషల్ డిఎస్సీ కల్పించాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో గతంలో చేపట్టిన బంద్ సందర్భంలో కూడా చంద్రబాబు స్పందిస్తూ టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తామని వాగ్దానం ఇచ్చి ఏడాదైనా గిరిజనులకు న్యాయం చేకూర్చకపోవడం చాలా బాధాకరమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలని ఈ రాష్ట్ర గిరిజన జీపు చేపట్టినట్టు తెలిపారు. జాతాకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని తెలిపారు. అలాగే జీవో 3 పునరుద్ధరణపై ప్రభుత్వ రెండు నాలుకల ధోరణి అవలంబిస్తుందని, దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. గిరిజనులను మోసగించేందుకు కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి, జనసేనా ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయని విమర్శించారు. గిరిజనుల హక్కులపై గిరిజన శాఖమంత్రి, ఎమ్మెల్యేలు, ఎంపీలు చట్టసభల్లో ప్రతిఘటించాలని కోరారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఏజెన్సీలో వంద శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టం చేయాలని, మెగా డీఎస్సీ నుంచి ఏజెన్సీ టీచర్ పోస్టులు మినహాయించి ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ గిరిజనుల సంపద గిరిజనులకే దక్కాలని 1/70 చట్టం చెబుతుందని, దీన్ని పూర్తిగా నిర్వీరించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సవరణలు చేపడుతున్నాయని ఇది గిరిజనుల పట్ల ద్రోహం తలపెట్టినట్టేనని అన్నారు. నేడు గిరిజనుల పంటకు ధర నిర్ణయించే హక్కు వారికే దక్కాలని, మైనింగ్ కోసం కార్పొరేట్లకు అనుమతిచ్చే కొండ తవ్వకాలను రద్దు చేయాలని, విద్య, వైద్యం, ఉపాధి అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు ఎ.అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు కె.రామస్వామి, నాయకులు కోరాడ ఈశ్వరరావు, యువతీ, యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు సంఘీభావం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డీఎస్సీలో ఏజెన్సీ ప్రాంతానికి స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలని, షెడ్యూల్ ఏరియాలో నూరు శాతం ఉద్యోగాలు గిరిజనులకే దక్కేలా చూడాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం నిర్వహిస్తున్న జీపు జాతా ఆదివారం పార్వతీపురం పట్టణానికి చేరుకుంది. ఈ జాతాకు స్థానిక పాత బస్టాండ్‌లో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు స్వాగతం పలికి గిరిజన సంఘం నిర్వహిస్తున్న ఉద్యమానికి సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, జిల్లా కార్యదర్శి బివి రమణ, ఉపాధ్యక్షులు వి.ఇందిర, రెడ్డి వేణు, డివైఎఫ్ఐ నాయకులు పి రాజశేఖర్, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఎస్.ఉమామహేశ్వరరావు, భానుమూర్తి, తదితరులు మద్దతు తెలిపారు.

కురుపాం : సీతంపేటలో శనివారం ప్రారంభమైన ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ సాధన జీపు జాతా ఆదివారం కురుపాం చేరుకుంది. ఈ సందర్భంగా కురుపాంలోని రావాడ జంక్షన్‌లో సభ జరిగింది. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు, ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ కోరాడ ఈశ్వరరావు, గిరిజన సంఘం ఉపాధ్యక్షులు కె.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

మక్కువ : ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ సాధన జీపు జాత ఎర్ర సామంత వలసకు చేరుకుంది. ఈ సందర్భంగా అక్కడి గిరిజనులను ద్దేశించి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మక్కువ మండల నాయకులు తాడంగి ప్రభాకర్ రావు, తాడంగి అరులప్ప, కె రామారావు, సిఐటియు నాయకులు ఎన్ వై నాయుడు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : జీపు జాత మక్కువ మండలం వైఎస్‌వలస, మార్కొండపుట్టి, శంబర మీదుగా సాలూరు మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేంద్ర, రాష్ట్ర నాయకులు ఎ.అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ప్రాంత నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం చేయకుండా మొండిగా వ్యవహరిస్తే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున గిరిజన ప్రాంత నిరుద్యోగులంతా ప్రజలను కలుపుకొని పోరాటాలకు సిద్ధపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్ వై నాయుడు తదతరులు పాల్గొన్నారు.

పాచిపెంట : జీపుజాతా మండలంలోని పెద్ద చీపురువలస ఆదివారం సాయంత్రం చేరుకుంది. ఆ గ్రామ పెద్ద రేయ్యి లచ్చయ్య ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.సురేంద్ర, నాయకులు ఎ.అశోక్ మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు చెల్లూరి జగన్నాథం డ్రై గంగరాజు సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

సాలూరులో జరిగిన సభలో మాట్లాడుతున్న సురేంద్ర

గిరిజన సంఘం నాయకులు స్వాగతం పలుకుతున్న మహిళలు

పార్వతీపురంలో జరిగిన సభలో మాట్లాడుతున్న గంగునాయుడు

ప్రశాంతంగా ఉపాధ్యాయుల బదిలీ కౌన్సిలింగ్

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఐటిడిఎ పరిధిలోని అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, వసతి గృహ సంరక్షకులు, మినిస్ట్రియల్, క్లాస్ -4 సిబ్బందికి బదిలీల ప్రక్రియ ఆదివారం ప్రశాంతంగా జరిగింది. స్థానిక ఐటిడిఎ గిరిమిత్ర సమావేశ మందిరంలో పిఒ అషుతోష్ శ్రీవాస్తవ ఆధ్వర్యంలో ఈ కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు, వసతి గహ సంరక్షకులు, వివిధ సబ్జెక్టులలో స్కూల్ అసిస్టెంట్స్, ఎస్‌జిటి, మినిస్టీరియల్ సిబ్బంది, క్లాస్ -4 సిబ్బందికి బదిలీలు చేపట్టారు. అనంతరం బదిలీ అయిన కొందరు ప్రధానోపాధ్యాయులకు,ఉపాధ్యాయులకు పిఒ బదిలీ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.కృష్ణవేణి డిప్యూటీ ఇఒ జ్ఞానప్రకాష్, ఎటిడబ్ల్యుఒలు చంద్రబాబు, సురేష్ కుమార్, వివిధ సంఘాల ఉపాధ్యాయులు, క్లాస్-4 సంఘ నాయకులు, వసతిగృహ సంక్షేమ సంఘ నాయకులు పాల్గొన్నారు.

కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న పిఒ అశుతోష్ శ్రీవాస్తవ

రాజన్నదొరకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

ఘనంగా రాజన్నదొర పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - సాలూరు

వైసిపి నాయకులు, మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర పుట్టినరోజు వేడుకలను పట్టణంలో తన నివాసం వద్ద నాయకులతో కలిసి ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కోలాహలంగా కేరింతల మధ్య కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్, ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ అప్పలనాయుడు, కౌన్సిలర్లు గిరి రఘు, సింగారపు ఈశ్వర్, వైసీపీ పట్టణ నాయకులు ఎమ్మెస్ నారాయణ, హరి బాలాజీ, మేకల శంకర్, శేషు, బాలకృష్ణ, ఎంపిపి ప్రతినిధి చినబాబు, డోల బాబ్జీ, టి.గౌరీశ్వరావు, సల్లాది అప్పలనాయుడు, మీసాల చంటి, రెడ్డి సురేష్, దండి శ్రీనివాసరావు, సువ్వాడ భరత్‌శ్రీను, నియోజాకవర్గ ఎంపిపిలు, మండల నాయకులు వైసిపి కార్యకర్తలు అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎరువులు అందక రైతుల ఇక్కట్లు

ప్రజాశక్తి - సీతానగరం

పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే వీటిని పంపిణీ చేయాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు రెడ్డి రమణమూర్తి డిమాండ్ చేశారు. సకాలంలో పచ్చిరొట్ట ఎరువులైన కట్టి జనుము, జీలుగులు, పిల్లి పెసర సరఫరా చేయలేదని, వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరితో రైతుల ఆందోళన పడుతున్నారని అన్నారు. గతేడాది ఎకరాఒక్కంటికీ 8కేజీ ధరపై ఈ ఏడాది అదనంగా రూ.200 ముందుగానే కట్టించుకున్నారని, అయినా సకాలంలో పంపిణీ చేయలేదని ఆందోళన వ్యక్తంచేశారు. మండల వ్యవసాయ అధికారి 20 రోజుల క్రితం పచ్చిరొట్ట ఎరువులు కావాల్సిన రైతులు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ప్రకటన ఇచ్చారన్నారు. ఒకరిద్దరూ రైతులకు పంపిణీ చేసి మమ అనిపించుకున్నారని, భూములు చదును చేసి సిద్ధంగా ఉంచుకున్నామని, అందుకు ప్రకృతి కూడా అనుకూలించి వర్షాలు పడి సహకరించింది కానీ అధికారులు కనికరం చూపట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతులందరికీ పచ్చిరొట్ట విత్తనాలు అందించి ఆదుకోవాలని ఆయన కోరారు.

పగుళ్లు ఇచ్చిన సిసి రోడ్డు

మూడు నెలలు గడవక ముందే పగుళ్లు

ప్రజాశక్తి వీరఘట్టం

స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు మండల పరిషత్ నిధులతో నిర్మించిన సిసి రహదారి నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో మూడు నెలలు కాకముందే పగుళ్లు ఏర్పడింది. సుమారు రూ.10 లక్షలతో ఈ ఏడాది మార్చిలో సిసి రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. పనులు జరిగినప్పుడు అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో పాటు నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో పది కాలాల పాటు ఉండాల్సిన సిసి రహదారి మూడు నెలలు పూర్తికాకముందే పగుళ్లు ఏర్పడింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే రహదారికి పగుళ్లు ఏర్పడిందని స్థానికులు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

గ్రామస్తులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

గుమ్మడివరాన్ని అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి సీతానగరం

మండలంలోని గుమ్మడివరం గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. మండలంలోని లచ్చయ్యపేట పంచాయతీ పరిధిలో గల గుమ్మడివరంలో కొత్తగా నిర్మించిన రామలయ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య, రోడ్లు నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమలు చేస్తామన్నారు. గ్రామస్తులు ముఖ్యంగా గ్రామానికి రోడ్డు సమస్య ఉందని,ఈ సమస్యపై గ్రామస్తులంతా ఆలోచించుకొని బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు ఇస్తే నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పి.సత్యం నాయుడు, ఆర్.వేణుగోపాలనాయుడు, బి.శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వి. గుంపుసామి, టిడిపి నాయకులు శ్రీరాములు, కృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పండగ నేపథ్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన విద్యుద్దీకరణ

పార్వతీపురంలో పండగ సందడి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పార్వతీపురం గ్రామ దేవతలైన ఇప్పలపోలమ్మ, ఎర్రకంచెమ్మ అమ్మవార్ల పండగ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు పట్టణాన్ని విద్యుత్ కాంతులతో తీర్చిదిద్దారు. పండగను తిలకించేందుకు సోమవారం నుంచి దూర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున బంధువులు, స్నేహితులు తరలివస్తున్నారు. ఈ ఉత్సవాలకు ఈ ఏడాది సుమారు 5 లక్షల మంది వరకు వచ్చేందుకు అవకాశం ఉందని ఉత్సవ కమిటీ సభ్యులు చెబుతున్నారు. సోమవారం రాత్రి అమ్మవార్ల తోలేళ్ల ఉత్సవం జరుగుతుంది, ఈ ఉత్సవంలో రైతులు ఎక్కువగా పాల్గొని ఇరువురి అమ్మవార్లకు పూజించే ధాన్యాన్ని తమ పొలాల్లో వేసే విత్తనాల్ల కలుపుకొని నారు పోస్తారు, మంగళవారం నిర్వహించే అమ్మవారి సిరిమానోత్సవానికి మానును సిద్ధం చేసే పనిలో ఉత్సవ కమిటీ సభ్యులు ఉన్నారు.

సంధ్యారాణిని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి- సాలూరు

రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిను బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు, టిడిపి పట్టణ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. బొబ్బిలి మున్సిపాలిటీని కూటమి కైవశం చేసుకోవడంతో సాలూరులో ఆదివారం కలిశారు.

పలుచోట్ల రేషన్ దుకాణాలు ప్రారంభం

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని సివినిలోనూ, పార్వతీపురం పట్టణం గెడ్డవీధిలోనూ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి రేషన్ సరుకులను లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ సరుకులను ఇకపైన చౌక ధరల దుకాణాలు వద్ద పంపిణీ జరుగుతుందన్నారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండల కేంద్రంలోని తెలగ వీధిలో రేషన్ డిపోను స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రారంభించారు. సరుకులు లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని డీలర్లకు హెచ్చరించారు. కార్యక్రమంలో కూటమి సీనియర్ నాయకులు పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, ఉదయాన ఉదయభాస్కర్, జామి లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, మాచర్ల అనిల్, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని గోయిదిలో జిసిసి ద్వారా నిర్వహిస్తున్న రేషన్ డిపోను పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా డిఆర్ డిపో నుంచి ఎల్లవేళల రేషన్ అందుబాటులో ఉంటుందని చెప్పారు. దీంతోపాటు నిత్యవసర సరుకులు కూడా అందుబాటులో నాణ్యమైనవి తక్కువ ధరకే లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో జిసిసి మేనేజర్ దాసరి కృష్ణ, డిటి మధుసూదన్, టిడిపి కోఆర్డినేటర్ హిమరక పవన్, నాయకులు పాల్గొన్నారు.

వృద్ధుల ఇళ్లకు వెళ్లి రేషన్ అందజేసిన కలెక్టర్

కురుపాం : మండల కేంద్రమైన కురుపాం లో రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి రేషన్‌డిపోను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎండిఎం వాహనాల ద్వారా పంపిణీ చేసిన నిత్య సరుకులు సక్రమంగా ప్రజలకు అందక అనేక ఇబ్బందులకు గురయ్యారని, కావున డిపోలు వద్దే రేషన్ పంపిణీ వ్యవస్థను కూటమి ప్రభుత్వం అందజేస్తుందని, లబ్ధిదారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.రవణమ్మ, మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య, మాజీ ఎఎంసి చైర్మన్ కోలా రంజిత్‌కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : మండలం వెంకంపేట, పార్వతిపురం పట్టణంలో బంగారమ్మ కాలనీ, సీతానగరం మండలం మరిపివలస గ్రామంలో రేషన్ డిపోలను స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు సంక్షేమ పథకాలు నిజాయితీగా అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్మని ఎమ్మెల్యే విజయచంద్ర స్పష్టం చేశారు. కార్యక్రమంలో అధికారులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొండ: మండలంలోని గోపాలపురంలో రేషన్ దుకాణాన్ని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రారంభించారు. రేషన్ డిపోలో సక్రమంగా నడిపించే బాధ్యత అధికారులు తీసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు, వైస్ ఎంపిపి వాకమూడి అనిల్, టిడిపి పట్టణ అధ్యక్షులు గంట సంతోష్‌కుమార్, జాడ శ్రీధర్, సర్పంచ్ జగదీష్ వెన్నపు శ్రీనివాసరావు, ప్రశాంత్, జానీ అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని ఎల్విన్‌పేట, గుమ్మలక్ష్మీపురంలో రేషన్ డిపోలను స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రారంభించారు. 65 ఏళ్ల దాటిన వృద్ధులు, వికలాంగులు గుమ్మలక్ష్మీపురం గ్రామీణ బ్యాంకు వీధికి చెందిన పి.సరోజిని, బొత్తాడ చంద్రమ్మ, చింతల దాసరి, ఎల్విన్ పేటకు చెందిన పొలం కాలనీ వాస్తవ్యులు మండల పద్మ, ఏనుగుల వెంకటేష్ ఇళ్ల వద్దకు వెళ్లి రేషన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పాడి సుదర్శన్‌రావు, తహశీల్దార్ శేఖర్, నాయకులు చిన్న, విప్లవకుమార్, రాజేష్, రామారావు, దొరబాబు, రాజేష్, మన్మథ, సేల్స్ మేన్‌లు సన్యాసిరావు, శ్రావణ్, విఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుని ఇంటికి వెళ్లి రేషన్ అందజేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, సబ్‌కలెక్టర్

కురుపాంలో రేషన్ అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

పాలకొండలో రేషన్ అందజేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పార్వతీపురంలో రేషన్ అందజేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

తాగునీరు సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి : కమిషనర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈనెల 1,2,3 తేదీల్లో జరుగుతున్న ఇప్పల పోలమ్మ, ఎర్రకంచెమ్మ అమ్మవార్ల పండగ నేపథ్యంలో పట్టణ ప్రజలతో పాటు, పండగకు వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం నాడు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఆయన మాట్లాడుతూ అమ్మవార్ల పండగలు ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న దృష్ట్యా కలెక్టర్ శ్యాంప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ఆదేశాలను అనుసరించి పట్టణ ప్రజలకు నిరంతరం తాగునీరు సరఫరా చేసేందుకు కార్యాలయంలో ఉన్న రెండు నీటి ట్యాంకర్లతో పాటు 5 నీటి ట్యాంకర్లను అద్దె ప్రాతిపదికన తీసుకున్నట్టు తెలిపారు. ఈ 7 ట్యాంకర్లతో నిరంతరంగా తాగునీరు సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. వార్డుల్లో వీధి దీపాల మరమ్మతులు చేయించామన్నారు. సిరిమానులు తిరిగే ప్రాంతాల్లో రోడ్లు మరమ్మతులు చేయించామని తెలిపారు. నిరంతర పారిశుధ్య నిర్వహణ పనుల కోసం ప్రజారోగ్య విభాగంలో ఉన్న పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులతో పాటు, అదనంగా 30 మంది ప్రైవేటు కార్మికులను నియమించాన్నారు. పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు సమస్యలు తలెత్తిన, ఫిర్యాదుల కోసం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా హెల్ప్ డెస్క్ నెంబర్ 8008237549కు ఫోన్ చేస్తే తక్షణమే సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు చేపడతారన్నారు. కావున పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కమిషనర్ కోరారు.

తాగునీటి సరఫరాకు సిద్ధం చేసిన ట్యాంకర్లు

'కాంగ్రెస్‌తోనే జంఝావతి పూర్తి'

ప్రజాశక్తి - కొమరాడ

జంఝావతి ప్రాజెక్టును కాంగ్రెస్‌నే పూర్తి చేస్తుందని పార్టీ నాయకులు అన్నారు. మండలంలోని రాజలక్ష్మీపురం సమీపాన గల జంఝావతి ప్రాజెక్టును కాంగ్రెస్ నాయకులు బత్తిన మోహన్ రావు, గేదెల రామకృష్ణ, వంగల దాలి నాయుడు, తీళ్ల గౌరీ శంకర్రావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి, కూటమి ప్రభుత్వాలకు జంఝావతిపై చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. ఒడిశా వివాదం పరిష్కారమయ్యేలోపు రైతులు ఇబ్బంది పడకూడదంటూ కాంగ్రెస్ అధికారంలో ఉండేటప్పుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి రబ్బరు డ్యామ్‌ను నిర్మించి జాతికి అంకితం చేశారన్నారు. ఆ తర్వాత వచ్చిన టిడిపి, వైసిపి, కూటమి ప్రభుత్వాలు రబ్బరు డ్యాం లిఫ్ట్‌ను నిర్వహించలేకపోవడం బాధాకరమన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో, ఒడిశాలో, కేంద్రంలో అనుకూల ప్రభుత్వాలు ఉన్నప్పటికీ జంఝావతి ప్రాజెక్టును పూర్తి చేయాలన్న చిత్తశుద్ధి కూటమి ప్రభుత్వానికి లేదని విమర్శించారు. అతి చిన్న సమస్యను పరిష్కరించేందుకు ముందుకు రావడం లేదన్నారు. ప్రభుత్వాలు స్పందించక పోవడంతో 5 మండలాల పరిధిలోని 75 గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయన్నారు. మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయడం జరుగుతుందన్నారు.

ఆధునిక పద్ధతులు అవలంభించాలి

ప్రజాశక్తి - సీతానగరం

రైతులు ఆధునిక పద్ధతులు పాటిస్తే వ్యవసాయం అధిక దిగుబడులు వస్తాయని ఐసిఎఆర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు, ఆర్థిక శాస్త్రవేత్త అనంత్ విహారి అన్నారు. మండలంలోని కె వెంకటాపురంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ ముందస్తు విత్తన ప్రణాళికను గూర్చి తెలియచేస్తూ నవధాన్య సాగు కోసం కట్టెలు, జీలుగు సాగు వివరించారు. అలాగే కౌలు రైతు కార్డులు, ఎరువుల యాజమాన్యం, పంటల బీమా గూర్చి తెలిపారు. రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను, నూతన వంగడాలను అవలంబిస్తూ ఒకే పంట విధానం కాకుండా అంతర్ పంటల వ్యవస్థను ఏర్పర్చుకొని సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. శాస్త్రవేత్త డాక్టర్ అనంత్ మాట్లాడుతూ పశుసంపదను కూడా ఆధునిక పద్ధతుల వైపు మళ్లాలని, బ్లాక్ బెంగాల్ మేకలను పెంపకం ద్వారా అధిక ఆదాయాన్ని పొందుతారని, ఈ విధానాన్ని కూడా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటేష్, ఐసిఎఆర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త అనంత్ విహారి, ఎఇఒ పి.లక్ష్మణ్, విఎఎ బి.యశ్వంత్, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

పిహెచ్‌సిలో మెరుగైన వైద్యం

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రైవేటు ఆసుపత్రులకు ధీటుగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కార్పొరేట్ వైద్యం కంటే ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించడం వల్ల గర్భిణీలతో పాటు. ఇతర రోగులు కూడా ఆసుపత్రికి వచ్చి వైద్యం పొందుతున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం ముగ్గురు గర్భిణీలను ప్రసవాల నిమిత్తం స్థానిక పిహెచ్‌సిలో చేర్పించడం ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రిపై నమ్మకానికి నిదర్శనమని అన్నారు. రోగులను దృష్టిలో పెట్టుకొని నిత్యం వైద్యసేవలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కారణంగా ప్రతిరోజు ఒపి పెరుగుతున్నట్టు ఆయన తెలిపారు.



పిహెచ్‌సిలో పసవాలు జరుపుతున్న వైద్య సిబ్బంది

కాలువ లేకుండా రోడ్డుకు దిగువున్న ఇళ్లు

కాల్వలు నిర్మించండి సారూ!

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని మక్కువ - చినబోగిలి రహదారి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సుమారు రూ.37 కోట్లకు పైగా నిధులతో ఈ రహదారి పనులు చేపడుతున్నారు. మండలంలోని ములక్యాయవలస, పాపయ్యవలస, కొయ్యన్నపేట, వెంకట బైరపురం గ్రామాల గుండా రహదారి నిర్మాణం జరుగుతుంది. గ్రామాల్లో ఆర్ అండ్ బి నిబంధనల మేరకు సిమెంట్ రోడ్లను నిర్మిస్తున్నారు. అయితే వెంకటబైరిపురంలో రహదారికి ఇరువైపులా కాలువలను నిర్మించారు. మునక్యాయవలస, పాపయ్యవలస, కొయ్యన్నపేట గ్రామాల్లో మాత్రం సిసి రోడ్డు నిర్మాణం చేపట్టే, కాలువల నిర్మాణం మాత్రం చాపట్టలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రహదారి ఎత్తు కావడంతో అంచున ఉన్న ఇళ్లలోకి వరద నీరు చొచ్చుకుపోయి ఇబ్బందులకు గురవుతున్నారు. తమ గ్రామాల పరిధిలోని ఆర్ అండ్ బి రహదారికి ఇరువైపులా కాలువల నిర్మించాలని కలెక్టర్‌కు ఇటీవలే స్థానిక వైసిపి నాయకులు కోట్ల నారాయణరావు, కొల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో రహదారికి ఇరువైపులా కాలువలు వెంటనే నిర్ణయించాలని స్థానికులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

రైలు ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గుచ్చిమి -జోగింపేట రైల్వే ట్రాక్ మధ్యలో పట్టాలు దాటుతున్న మరిపి అప్పలనాయుడు(33) గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసు అందించిన వివరాలు ప్రకారం గుచ్చిమి గ్రామానికి చెందిన అప్పలనాయుడు ఆదివారం ఉదయం తన ఇంట్లో నుంచి తోటకు వెళ్లే సమయంలో రైల్వే ట్రాక్ దాటుతుండగా ప్రమాదవశాత్తు గుర్తుతెలియని రైలు ఢీకొని మృతి చెందాడు. ట్రాక్ పక్కన పడివున్న మృతదేహాన్ని గమనించిన రైల్వే కీమాన్ ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని రైల్వే హెడ్ కానిస్టేబుల్ రత్నకుమార్ తెలిపారు. శవపంచనామా నిమిత్తం మృతదేహాన్ని పార్వతీపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రైలు ప్రమాదంలో మృతి చెందిన అప్పలనాయుడు

స్కూటీ బోల్తా పడి యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని జాతీయ రహదారిపై రాజాపులోవ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. భీమిలి మండలం టి.నగరపాలేనికి చెందిన గడదాసరి సాయి (27) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. స్కూటీపై రాత్రి పదిన్నర ప్రాంతంలో వెళ్తుండగా ప్రమాదవశాత్తు బోల్తా పడి తీవ్రంగా గాయ పడ్డాడు. వెంటనే విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సూర్యకుమారి తెలిపారు.

ప్రాణం తీసిన ఈత సరదా

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

ఈత సరదా యువకుడి ప్రాణాలను బలిగొన్న సంఘటన ఆదివారం పార్వతీపురం మండలం నరసిపురంలో జరిగింది. ఆదివారం సెలవు దినం కావడంతో పార్వతీపురం పట్టణంలోని మూడవ వార్డు రౌతు వీధి కి చెందిన మజ్జి తరుణ్ 24 అనే యువకుడు తన స్నేహితులతో కలిసి మండలంలోని నర్సిపురం వెంకటరాయుడిపట పంట పొలాల్లో ఉన్న చింత వారి నేల బావిలో ఈత కొట్టడం కోసం వెళ్లారు. బావిలో దిగి స్నానం చేస్తుండగా కదలికలు లేకుండా ఉన్న తరు ణ్ పరిస్థితి గమనించిన స్నేహితులు ఒడ్డున తీసుకువచ్చి పరిచర్యలు చేశారు. అయితే ఎలాంటి చేతన లేకపోవడంతో మృతి చెందినట్లు గమనించారు. అనుమానం వచ్చి పరిస్థితిని పోలీసులకు వివరించారు. ఈ విషయంపై రూరల్ ఎస్సై సంతోషి కుమారి సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - కురుపాం

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన కురుపాం సమీపాన ఎర్ర చెరువు వద్ద ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం గుమ్మలక్ష్మీపురం మండలం ఎల్విన్‌పేటలోని గల ప్రతిభ భారతి కాలనీకి చెందిన పత్తిక రామమోహన్ కురుపాం నుండి గుమ్మలక్ష్మీపురం లగేజ్ ఆటోపై వస్తూ చెట్టును ఢీకొని తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108కి సమాచారం అందించగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. స్థానిక పోలీసులు వివరాల సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

మంటలు చెలరేగి దగ్ధమైన ద్విచక్ర వాహనం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని పెదబొండపల్లి తామర చెరువు గట్టుపై ద్విచక్ర వాహనంలో మంటలు చెలరేగి ఆపై వాహనం దగ్ధమైన సంఘటన జరిగింది. ఆదివారం తాళ్లపూడి గ్రామానికి చెందిన వ్యక్తి ద్విచక్ర వాహనంపై తమ గ్రామానికి వెళ్తుండగా, అధిక వేడిమి తట్టుకోలేక బండిలో షార్ట్ సర్క్యూట్ కావడంతో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. భయపడిన వ్యక్తి వాహనాన్ని అక్కడే వదిలేసి పారిపోవడంతో బైక్ పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.